క్లుప్తంగా

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్


డ్రైవ్‌లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: దోమల నివారణకు పట్టణంలో మంగళవారం మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైన్లను శుభ్రపరచి ప్రజలకు దోమల నివారణకు తీసుకోవల్సిన చర్యలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటినిల్వ ఉన్న మట్టికుండలు, ప్లాస్టిక్ డ్రమ్ములపై మూతపెట్టాలన్నారు. నీటి డ్రమ్ములపై దోమలు దూరకుండా గుడ్డతో గట్టిగా కట్టాలన్నారు. తాగునీటిని వేడి చేసి చల్లారిన తరువాత తాగాలన్నారు. అనంతరం పలుఅంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి, పరివార దేవతలకు క్షీరాభిషేకాలు


108 కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి జన్మతిరు నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీవారికి, పరివార దేవతలకు వైభంగా అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం అర్చకులు 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి, పరివార దేవతలకు, పుష్కరిణిలో కొలువైన శ్రీలక్ష్మీ వరహాస్వామివారికి 108 కలశాలతో క్షీరాభిషేకించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు, భక్తులు కలశాలతో ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ గుండెపోటుతో మృతి


వీరాస్వామి (ఫైల్)

తుని రూరల్: విధి నిర్వహణలో ఉన్న తుని మండల ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ కె.వీరాస్వామి(58) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం విధులకు హాజరైన ఆయన జిరాక్స్ కాపీలు తీయించేందుకు వెళ్లగా గుండెపోటుతో కుప్పకూలిపోయారు. స్థానికులు సమాచారంతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది హుటాహుటీన తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలియడంతో తహసీల్దార్ ఎల్.శివకుమార్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఆస్పత్రికి వెళ్లి వీరాస్వామి మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం పెదపూడికి తరలించారు. వీరాస్వామికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గిడజాంలో వ్యక్తిపై దాడి

రౌతులపూడి: గిడజాంలో చెక్కా వెంకటేశ్వరరావుపై అదే గ్రామానికి చెందిన జల్లు చిట్టిబాబు దాడి చేసి గాయపరిచారని మంగళవారం ఫిర్యాదు అందినట్టు రౌతులపూడి ఎస్సై అబ్దుల్‌నబి తెలిపారు. తన కిరాణ దుకాణంలో అరువు ఇవ్వలేదని అక్కసుతో ఈ దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు.

సారాతో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో మంగళవారం దాడులు నిర్వహించి, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. జగపతినగరం గ్రామంలో మాడిపోయిన శ్రీనును అదుపులోకి తీసుకుని, అతని నుంచి ఐదు లీటర్ల సారా, స్పందన ఫిర్యాదు మేరకు చిట్టిబోయిన సింహాచలం అనే మహిళను అరెస్టు చేసి, ఆమె నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు.

అధికారుల పనితీరును నిరసిస్తూ రైతుల ఆందోళన

ప్రత్తిపాడు రూరల్: పోతులూరు సమీపంలోని పుష్కర ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ వద్ద అధికారుల పనితీరును నిరసిస్తూ మంగళవారం 15 గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ జూన్ మొదటి వారంలోనే పుష్కర ఎత్తిపోతల పథకానికి చెందిన 23 ఎకరాల ఆయకట్టుకు అధికారులు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. అయితే అధికారుల నీటి విడదలలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పుష్కర ఎత్తిపోతల పథకం తుని ఈఈ బి.గోవింద్‌ను కలిసి తమ సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు మొర పెట్టికున్నా ఆయన లెక్కచేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోతుతున్నారు. పోతులూరు గ్రామ సర్పంచ్ బొండు రాంబాబు, మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు, ఒమ్మంగి సొసైటీ బ్యాంక్ చైర్మన్ కొప్పన గంగారావు, శరభవరం ఎంపీటీసీ అమరాది కాశి జగన్నాథం, చంటిబాబు, సత్యనారాయణ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలకు ఆదరణ కరవు

- తగ్గిన కొనుగోళ్లు
- ఎంతోమంది ఉపాధికి గండి


జనసంచారం లేని వారపుసంత

ఏలేశ్వరం: ఒకప్పుడు వారపు సంతలకు ఎంతో ఆదరణ ఉండేది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి పలు రకాల వస్తువులు అమ్మకాలు చేయడంతోపాటు కావాల్సిన సరకులు కొనుగోలు చేసుకొని వెళ్లేవారు. ఇప్పుడు వాటిని ఆదరణ తగ్గిపోయింది. కరోనా రావడం, పెద్దషాపుల ఏర్పాటు, ఆన్‌లైన్ వ్యాపారాలు అందుబాటులో ఉండడంతో సంతలకు వచ్చే వారి సంఖ్య భారీగా తగ్గిందనే చెప్పవచ్చు. ముఖ్యంగా గ్రామాల్లో నిర్వహించే వారపు సంతలకు జనం రావడం తగ్గడంతో క్రమంగా వాటిని నిర్వహించడం మానేశారు. సంతల్లో రకరకాల వస్తువులు అందుబాటులో ఉండడంతోపాటు తక్కువ ధరలకు లభించేవి. సంతల్లో కూరగాయాలతోపాటు కిరాణా సామాన్లు, నాటుకోళ్లు, ఏజెన్సీ వస్తువులు అందుబాటు ధరల్లో ఉండేవి. పప్పు ఉప్పుల నుంచి ఇంటిలో ఉపయోగించే వస్తువులన్నీ దొరికేవి. రైతులకు తామ పండించే పంటలను స్వేచ్ఛగా అమ్ముకునే వారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కత్తిపూడి, శంఖవరం, అన్నవరం, పెదమల్లాపురం, రౌతులపూడి తదితర గ్రామాల్లో వారపుసంతలు జరిగేవి. సంతలకు దాదాపు వేలల్లో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వచ్చేవారు.

కరోనా కారణంగా..

ఇప్పుడు వారపు సంతలు కనిపించడంలేదు. కరోనా కారణంగా వారపు సంతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గత రెండేళ్లనుంచి సంతలకు వచ్చే జనం తగ్గుముఖం పట్టారు. కోవిడ్ ప్రభావంతో ఆటోలు, ఇతర వాహనాలతో కూరగాయాలు ఇంటి వద్దకే రావడం అలవాటుగా మారింది. దీంతో సంతలకు వెళ్లే పరిస్థితి తగ్గింది. అంతేకాకుండా గ్రామాల్లో పెద్ద పెద్ద షాపులు ఏర్పడడంతో వాటికి ఆదరణ తగ్గింది.

ఆదాయానికి గండి

సంతల నిర్వహణ ద్వారా ప్రతి వారం పంచాయతీలకు కొంత ఆదాయం వచ్చేది. పలు కుటుంబాలు సంతలపై ఆధారపడి జీవించేవి. ముఖ్యంగా సంత


వారపుసంతలో తగ్గిన దుకాణాలు

రోజుల్లో ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేది.ఆర్టీసీతో పాటు ప్రైవేట్ వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగించేవి. ఇప్పుడు ఆ ఆదాయాలకు గండి పడింది. ఎంతోమంది ఉపాధిని కోల్పోయారు. సంతలు పూర్వవైభవం పొందాలని సామాన్య ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పూర్వవైభవం రావాలి



తాజాగా ఉండే కూరగాయాలతో పాటు తక్కువ ధరలకే లభించేవి. వారపుసంతలకు పూర్వవైభవం రావాలి. వీటితోనే సామాన్యప్రజలు ఉపశమనం పొందుతారు. ప్రజల్లో సంతలపై అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గూడవిల్లి అర్జునరావు ఏలేశ్వరం

అందుబాటులో ధరలు



వారపు సంతల్లో ధరలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వారపు సంతల్లో దుకాణాల సంఖ్య తగ్గడంతో పాటు ఇళ్లకు వచ్చే వాహనాల్లో ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– కోరాడ రాజు, ఏలేశ్వరం

డిగ్రీ కాలేజీలో గెస్ట్ లెక్చరర్‌కు ఆహ్వానం

తుని రూరల్: వి.కొత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో పొలిటికల్ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ లెక్చరర్‌ను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపా రు. సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసిన అభ్యర్థు లు ఈనెల 30న నేరుగా తగిన ధృవ పత్రాలతో హాజరుకావాలన్నారు. ఎన్‌ఈటీ, ఎస్ఎల్‌ఈటీ, పీహెచ్‌డీ తదితర అదనపు అర్హతులు ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

ఘనంగా అమ్మవారి జాతర


అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు

గోకవరం: పెంటపల్లిలోని ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం 500 మంది మహిళలు బోనాలు ఎత్తి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పసుపు, కుంకుమతో పాటు బోనాలు సమర్పించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించారు.

సమస్యల పరిష్కారానికి కృషి


తుని పట్టణంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బాలు

తుని: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమం తోడ్పడుతుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. మంగళవారం 16వ వార్డులో కౌన్సిలర్ కస్పూరి మంగ ఆధ్వర్యంలో గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికలు తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందక పోతే సచివాలయంలో వినతిపత్రం ఇవ్వాలన్నారు. గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్‌ఆర్‌యుసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్వతను కలిసిన అనసూయ


శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞత తెలుపుతున్న అనసూయ

శంఖవరం: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహణ సభ్యురాలిగా ఎంపికైన కత్తిపూడి గ్రామానికి చెందిన ఆకుల అనసూయ మంగళవారం శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, కార్యకర్తలు అనసూయకు శుభాకాంక్షల తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, సర్పంచ్ కొల్లు సత్తిబాబు, కో ఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, ఎంపీటీసీలు చల్లా సత్యప్రసాద్, జీలకర్ర వీష్ణు, వైఎస్సార్ సీపీ నాయకులు గొౌతు అర్జుబాబు, ఆకుల దేవేంద్రుడు, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఒమ్మి రఘురాంకు బంగారు పతకం


గోల్డ్ మెడల్ అందుకుంటున్న ఒమ్మి రఘురాం

జగ్గంపేట: నిత్య విద్యార్థిగా ఉన్న రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి డాక్టర్ ఒమ్మి రఘురాం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్, సోషల్ వర్కు విభాగంలో గోల్డ్‌మెడల్ అందుకున్నారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో డాక్టర్ హెచ్ హెచ్ డైక్మన్, డాక్టర్ ఎస్.జాన్‌డేవిడ్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ కె.అబ్దుల్ నజీర్ చేతుల మీదగా గోల్డుమెడల్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రామన్ మెగసేసే అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్, న్యాక్ డైరెక్టర్ గణేషన్ కన్నాభిరన్, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య పొట్టేటి రాజశేఖర్ పాల్గొన్నారు.

కన్నబాబును కలిసిన ఏడుకొండలు


కాకినాడలో కన్నబాబును మర్యాద పూర్వకంగా కలిసిన ఏడుకొండలు

గోకవరం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా మూడో సారి నియమితులైన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట గుడాల రామకృష్ణ, దాకే రఘు, ఇజ్జిన కిరణ్ కుమార్, పత్తి రమేష్ తదితరులు ఉన్నారు.

తుని పట్టణంలో అభివృద్ధి పరుగులు

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుధారాణి
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుధారాణి, హాజరైన కౌన్సిలర్లు

తుని: ప్రగతి పథంలో తుని పట్టణ అభివృద్ధి పరుగులు తీస్తోందని, ఇందుకు ప్రజా ప్రతినిధులు, అధికారుల సాయంతోనే సాకారమవుతోందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 47 అంశాలపై చర్చించి, 45 అంశాలను ఆమోదించారు. రెండు అంశాలు డబుల్ ఎంట్రీ రావడంతో తొలగించారు. పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామని, కొన్ని ప్రాంతాలకు ఎక్కువ నిధులు అవసరం ఉందన్నారు. సహచర కౌన్సిలర్లు ఇస్తున్న వినతులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సమస్యలపై గళం : పట్టణంలోని 30 వార్డులకు సంబంధించిన పలు సమస్యలపై కౌన్సిలర్లు గళమెత్తారు. వార్డు సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు కొరత వల్ల ప్రజలకు సత్వరమే సేవలు అందడంలేదని కౌన్సిలర్లు షేక్ ఖ్వాజా, కలగట్ల ప్రశాంతి అన్నారు. పార్కు సెంటర్లో రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చాలని కోరారు. సమితి ఆఫీసు, గుర్గాదాస్ వీధుల్లోని కాలువలు పూడిక పోవడంతో మురుగు నీరు పారుదలకు అంతరాయం కలుగుతుందని, వర్షం వస్తే రోడ్లు నీటితో నిండిపోతున్నాయని కౌన్సిలర్ కనిగిరి వెంకటరమణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మార్కండ్రాజుపేట ఎంపీపీ పాఠశాలను నాడు–నేడులో అభివృద్ధి చేయాలని కౌన్సిలర్ చింతకాయల భారతి కోరారు. జాతీయ రహదారి డీమార్టు దగ్గర ఉన్న అపార్ట్‌మెంట్లు నుంచి మురుగు నీటిని నేరుగా కొండవారిపేట అండర్‌పాస్‌కు వస్తుందని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్ చింతల సునీత సీపీ సుధారాణి దృష్టికి తీసుకువచ్చారు. రైల్వేట్రాక్ ఆవతల ఉన్న వార్డుల్లో విచ్చలవిడిగా సారా, గంజాయి విక్రయిస్తున్నారని, దీని వల్ల విద్యార్థులు, యువత వాటికి బానిసలవుతున్నారని కౌన్సిలర్ కర్రి జగదీష్ అన్నారు. ప్రస్తుతం ఉన్న చేపల మార్కెట్‌లో మాత్రమే విక్రయాలు చేయాలని, రహదారులపై దుకాణాలు పెడ్డడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు అన్నారు. ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించాలని కోరారు. కౌన్సిలర్లు తీసుకువచ్చిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఛైర్‌పర్సన్ సుధారాణి అధికారులను ఆదేశించారు. కమిషనర్ ప్రసాదరాజు, సీఐ రామకృష్ణ, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని కారు బోల్తా

గండేపల్లి: 16వ నంబర్ జాతీయ రహదారిలో డివైడర్‌ను ఢీకొట్టిన కారు బోల్తా పడిన సంఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది హెచ్‌సీ అప్పారావు, స్వామి, స్థానికుల వివరాల ప్రకారం.. రావులపాలెం దగ్గర పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన ఎనిమిది మంది అన్నవరం సత్యదేవుని దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా మల్లేపల్లి శివారుకు వచ్చే సరికి ముందు వెళుతున్న లారీ డ్రైవర్ హఠాత్తుగా కుడివైపునకు మళ్లించే ప్రయత్నం చేశాడు. దీంతో కారు లారీని ఢీకొని డివైడర్ పైకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు కాగా ప్రయాణికుల్లో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారికి ప్రథమ చికిత్స అందించారు. ప్రమాదస్థలానికి చేరుకున్న రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది తక్షణ సహాయక చర్యలు అందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా నీలాద్రిరావుపేట నుంచి కూలీలను తీసుకు వెళుతున్న ఆటో తాళ్లూరు వద్దకు వచ్చేసరికి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

పాడిరైతుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం


కోటనందూరులో రుణ మంజూరుపై అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ డాక్టర్ రత్నతేజ

కోటనందూరు: పాడిరైతుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వెటర్నరీ డాక్టర్ రత్నతేజ అన్నారు. మంగళవారం కోటనందూరు, ఇండుగపల్లి, కాకరాపల్లి, బొద్దవరం గ్రామాల్లో పాడిరైతులకు డీసీసీబీ లోన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకంలో పాలు పోసే రైతులకు పెట్టుబడి సహాయంగా కో–ఆపరేటివ్ బ్యాంకు నుంచి రూ.35 వేలు రుణం ఇచ్చారు. రైతులకు ఇబ్బంది లేకుండా బ్యాంకు అధికారులే నేరుగా గ్రామాలకొచ్చి రుణాలు మంజూరు చేస్తున్నారన్నారు. అమూల్ డెయిరీకి పాలు పోసే పాడి రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, డీసీసీబీ బ్యాంకు అధికారులు, వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది పాల్గొన్నారు.

కచ్చితమైన ఓటరు జాబితాయే లక్ష్యం


శంఖవరంలో బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్

శంఖవరం: కచ్చితమైన ఓటరు జాబితా తయారీనే లక్ష్యంగా పని చేయాలని డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాస్ బీఎల్‌ఓలకు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన వారిని ఓటరుగా చేర్చాలని సూచించారు. ఓటరు జాబితా తయారీలో తప్పులు దొర్లితే బీఎల్‌ఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే బూత్ లెవెల్‌లో సర్వే చేయించామన్నారు. మరణాలు ఉంటే క్షుణంగా పరిశీలించి ఓట్లు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బి.రేవతి, వీర్వోలు వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


పది విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందిస్తున్న నాయకులు


యర్రవరంలో గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కోటనందూరు: బొద్దవరం హైస్కూల్లో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సర్పంచ్ వేగి లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు తెలుగు భాషా ప్రావీణ్యుడు గిడుగు రామ్మూర్తి నాయుడు, హాకీప్లేయర్ ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి తొలి రెండు స్థానాలు సాధించిన విద్యార్థులకు మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అరుగుల మోషే సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని వారి తల్లిదండ్రులకు అందజేశారు. వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు, అప్పలనాయుడు, బాబ్జీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: తెలుగు భాషా దినోత్సవాన్ని యర్రవరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. యర్రవరంలోని విజ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వివి రమణ ఆధ్వర్యంలో గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కొల్లా శ్రీనివాస్, కోరాడ నరసింహమూర్తి, రాజేష్, వెంకటేశ్వరరావు, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

తుని: తెలుగు భాషకు ఉన్న ప్రాధాన్యతను యువతి, యువకులు గుర్తించాలని తుని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు దువ్వాడ వెంకట రామచౌదరి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తుని శ్రీప్రకాష్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామన్న చౌదరి తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు బి.సీతారాణి, మాధవి సీతారత్నం, ప్రసూన మాళి, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిర్లంపూడి: తామరాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రధాన ఉపాధ్యాయుడు ఎల్.కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. తెలుగుదనం ఉట్టిపడేలా చిన్నారులు వివిధ వేషాధరణలో వచ్చారు. విద్యార్థులకు చేసిన సాంస్కృతిక, సాంఘిగ నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇంటర్‌లో తెలుగులో 98 మార్కులు సాధించిన ఆర్.వరలక్ష్మిని ఉపాధ్యాయులు సన్మానించారు.

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా సాహితీ వేత్త గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ పూలమాల వేసి, నివాళులర్పించారు. మినర్వా విద్యా సంస్థల ప్రాంగణంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు.

తొండంగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం తెలుగు భాషాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొండంగి, ఎ.కొత్తపల్లి, బెండపూడి, తమ్మయ్యపేట, పి.ఇచిన్నాయపాలెం, రావికంపాడు తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషా ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కూడా తెలుగు భాషాదినోత్సవాన్ని నిర్వహించారు.


తామరాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: ప్రతి ఒక్కరూ శిక్షణపై పూర్తి బాధ్యతతో వ్యవహరించి సద్వినియోగం చేసుకొవాలని మున్సిపల్ నోడల్ అదికారి సీహెచ్ సుజాత సచివాలయ కార్యదర్శులకు సూచించారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ కార్పొరేషన్, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలలోని సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఫ్యాకల్టీ శ్రీకైలాస్ శిక్షణ నిర్వహించగా మున్సిపాలిటీల నోడల్ అధికారులు యు.జ్యోతిరామ్, ఎస్‌వీ రామారావు, కె.శ్రీనివాసరావు, కేపీ ప్రసన్న పాల్గొన్నారు. అనంతరం కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు అన్నారు. వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాషువా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన క్రీడాకారులను సత్కరించారు. కాకినాడకు చెందిన హరీష్ స్పోర్ట్స్ తలాటం హరీష్ పాఠశాలలో యోగా, క్రీడా పెయింటింగ్ కోసం రూ.25వేలు అందించిన సందర్భంగా తనను సత్కరించారు.